మండపం పేరుతో ఏటా రూ.లక్షలు ఖర్చు

- శాశ్వత కల్యాణ మండప నిర్మాణంపై దృష్టిపెట్టని ఆలయ అధికారులు
- కాంట్రాక్టర్లను బతికిస్తున్న వైనం
- అధికారుల తీరుపై పెదవి విరుస్తున్న భక్తులు


అమ్మవారి కల్యాణోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కల్యాణ మండపం సెట్టింగ్ (ఫైల్)

పెనుగంచిప్రోలు: ఆలయ అధికారుల అనాలోచిత నిర్ణయాల కారణంగా శ్రీలక్ష్మి తిరుపతమ్మ ఆలయానికి ఏటా లక్షలాది రూపాయల ఖర్చు తప్పడం లేదు. ఏటా మాఘశుద్ధ పౌర్ణమి రోజున నిర్వహించే అమ్మవారి కల్యాణం కోసం శాశ్వత మండపాన్ని నిర్మించే అవకాశం ఉన్నప్పటికీ ఆదిశగా ఆలయ పాలకులు తీసుకుంటున్న చర్యలు శూన్యం. కల్యాణం నిర్వహించేందుకు మండపం సెట్టింగ్, ఇతర ఏర్పాట్ల కోసం ఆ ఒక్కరోజే ఆలయ సొమ్ము లక్షలాది రూపాయలు ఖర్చు చేసేందుకైనా ఇష్టపడుతున్నారు తప్ప శాశ్వత ప్రతిపాదికన పనులు చేపట్టేందుకు వారు ఎటువంటి చర్యలు తీసుకోకపోతుండటం గమనార్హం.

మండపం ఏర్పాటుకు ఈ ఏడాది రూ.9లక్షలు..

శ్రీతిరుపతమ్మవారి వార్షిక కల్యాణాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు ఏటా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఆలయ అధికారులు కూడా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తూ భక్తులకు ఆహ్వానాలు పలుకుతోంది. ఏటా అమ్మవారి కల్యాణం నిర్వహణకు అంగరంగవైభవంగా మండపాన్ని నిర్మిస్తారు. ఈనెల 11వతేదీన కూడా అమ్మవారి కల్యాణాన్ని వైభవోపేతంగా జరిపించారు. అయితే ఈ ఏడాది కల్యాణ మండపం నిర్మాణం కోసం టెండర్లు పిలువగా ఖమ్మంనకు చెందిన ఓ కాంట్రాక్టర్ జీఎస్టీతో కలుపుకుని రూ.9లక్షలకే మండపం సెట్టింగ్ ఏర్పాటు చేసే హక్కులు పొందారు. కల్యాణాన్ని భక్తులు వీక్షించేందుకు ఏర్పాట్ల కోసం ఏటా రూ.5లక్షల నుంచి రూ.6లక్షల వరకు ఖర్చు చేశారు. భక్తుల ఏర్పాట్ల కోసం అయ్యే ఖర్చు ఏటా తప్పనప్పటికీ, కల్యాణ మండపం సెట్టింగ్ నిర్మాణం పేరుతో మాత్రం ప్రతి ఏడాది రూ.10లక్షల వరకు ఖర్చు చేస్తుండటంపై భక్తులు పెదవి విరుస్తున్నారు. కమిషన్ల కోసమే ఇలా చేస్తున్నారనే విమర్శలు భక్తుల నుంచి వినిపిస్తున్నాయి. ఈ నిధులతో శాశ్వత కల్యాణ మండపం నిర్మించే అవకాశం ఉన్నప్పటికీ ఆదిశగా ఆలయ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఒకసారి ఖర్చుతో శాశ్వత నిర్మాణం..

అమ్మవారి కల్యాణం కోసం ఓ ఏడాది చేసే ఖర్చుతో శాశ్వత కల్యాణ మండపం నిర్మాణం చేసే అవకాశం ఉన్నప్పటికీ ఆలయ అధికారులు మాత్రం ఆదిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పాలకవర్గాలు ఎన్ని మారినా.. ఈఓలు ఎంతమంది వచ్చినా శాశ్వత కల్యాణ మండపం మాత్రం ఏర్పాటు చేయడం లేదు. ఏటా కాంట్రాక్టర్ ద్వారా కల్యాణ మండపం ఏర్పాట్లు చేసేందుకే మొగ్గుచూపుతుండటం గమనార్హం. గతంలో ఓ ఏడాది ఇలా కాంట్రాక్టర్ నిర్మించిన కల్యాణ మండపం కూలిపోవడంతో అమ్మవారి కల్యాణం జరిపించేందుకు ఇబ్బందులు తప్పలేదనే విషయాన్ని భక్తులు గుర్తుచేస్తున్నారు.

భక్తులకు తప్పని ఇక్కట్లు..

కాంట్రాక్టర్ ద్వారా ఏర్పాటు చేయించే కల్యాణ వేదికపై అధికశాతం మంది కూర్చుంటున్నారు. వీఐపీలు, అర్చకులు సైతం కల్యాణ వేదికను పూర్తిగా ఆక్రమిస్తుండటంతో సామాన్య భక్తులకు అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు అవకాశం లేకుండాపోతోంది. దీంతో కల్యాణాన్ని చూసేందుకు సుదూరప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఆగమశాస్త్రం ప్రకారం శాశ్వత కల్యాణ మండపాన్ని నిర్మిస్తే వేదికపై అంతమంది కూర్చొనే అవకాశం ఉండదు. కేవలం కల్యాణాన్ని జరిపించే అతికొద్ది మంది ముఖ్యులు మాత్రమే వేదిక ఉంటారు. తద్వారా భక్తులంతా కల్యాణాన్ని తిలకించే అవకాశం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా ఆలయ అధికారులు స్పందించి శాశ్వత కల్యాణ మండపం నిర్మాణం కోసం తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆలయ ఇంజినీరింగ్ అధికారులను వివరణ కోరగా వచ్చే ఏడాది అమ్మవారి కల్యాణం సమయానికి శాశ్వత కల్యాణ మండపం ఏర్పాటయ్యేలా తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

మునేటి బ్రిడ్జి వద్ద చెత్త వేస్తే చర్యలు : కమిషనర్

నందిగామటౌన్(నందిగామ రూరల్): మునేటి బ్రిడ్జిల వద్ద చెత్తను పడేసేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రమణబాబు హెచ్చరించారు. పట్టణంలోని పల్లగిరి రోడ్డులో మున్నేటిపై ఉన్న చిన్న, పెద్ద బ్రిడ్జిల పరిసరాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని కమిషనర్ పర్యవేక్షణలో మున్సిపల్ సిబ్బంది సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బ్రిడ్జిల వద్ద వేసే చెత్త మున్సిపాలిటీ సేకరించిన చెత్త కాదన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది సేకరించిన చెత్తను పల్లగిరి కొండ ప్రాంతంలో డంప్ చేస్తున్నామన్నారు. కొంత భాగం చెత్తను జిందాల్ కంపెనీకి తరలిస్తున్నట్లు వివరించారు. నిఘా ఏర్పాటు చేసి రోడ్ల పక్కన చెత్త వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

నేడు బహిరంగ వేలం

దాములూరు(నందిగామ రూరల్): మహాశివరాత్రి సందర్భంగా దాములూరులో వేంచేసియున్న సంగమేశ్వర స్వామివారి ఆలయం వద్ద పలు వ్యాపారాల నిర్వహణ హక్కులకు మంగళవారం వేలం నిర్వహించనున్నట్లు గ్రామ కార్యదర్శి జీవనజ్యోతి, సర్పంచ్ గాదెల వెంకటరామారావు సోమవారం తెలిపారు. బొమ్మలు, కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు, గాజులు, స్టీలు సామాను, స్వీట్లు అమ్ముకునే హక్కులకు మంగళవారం మధ్యాహ్నం మూడుగంటలకు వేలం నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తిగలవారు వేలంలో పాల్గొనాలని వారు కోరారు.

క్లుప్తంగా

యాగశాలకు శంకుస్థాపన



మక్కపేట(వత్సవాయి): దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో మక్కపేటలో నూతనంగా నిర్మించిన శ్రీ అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరస్వామి వారి ఆలయం ప్రతిష్టకు సిద్ధమైంది. మార్చి 8వ తేదీ నుంచి 10వరకు ప్రతిష్టా కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అందులోభాగంగా సోమవారం యాగశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లెల శివప్రసాద్, వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షుడు కనగాల రమేష్, మాజీ సొసైటీ అధ్యక్షులు కొండబోలు బ్రహ్మం, కనగాల భాస్కరరావు, అర్చకులు కేవైఎన్ శర్మ, రాఘవశర్మ, యుగంధర్‌శర్మ, సంగయ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సప్తాహ మహోత్సవాలు



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): గ్రామంలో వేంచేసియున్న శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా, అష్టహోమాలు, హరేరామ నామ సంకీర్తన సప్తాహ మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామంలో జలాలతో ఊరేగింపు నిర్వహించి అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు పరాంకుశం సీతారామాచార్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

వత్సవాయి: కొమరగిరి ట్రస్టు, చిన్న అవుటపల్లి పిన్నమనేని సిద్దార్థ కంటి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచితకంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ట్రస్టు అధ్యక్షులు కొమరగిరి రవీంద్రభరద్వాజ్ సోమవారం తెలిపారు. గ్రామంలోని శ్రీసాయి సెంచరీ హైస్కూల్ ఆవరణలో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆపరేషన్ అవసరమైన వారిని అదేరోజు సాయంత్రం ప్రత్యేక వాహనంలో తీసుకువెళ్లి ఆపరేషన్లు చేయించి, తిరిగి వారిని ఇంటివద్ద దించుతామని వివరించారు. శిబిరానికి హాజరయ్యేవారు ఆధార్‌కార్డును వెంట తీసుకురావాలని ఆయన సూచించారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

వత్సవాయి : మండలంలోని ఆయా సచివాలయాల్లో మంగళవారం నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్.రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వతేదీ మంగళవారం మక్కపేట, మాచినేనిపాలెం, 19న మంగొల్లు–2, కాకరవాయి, 20న కన్నెవీడు, కంభంపాడు, 21న ఇందుగపల్లి, వేమవరం గ్రామ సచివాలయాల్లో ఈ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు క్యాంపు ఉంటుందన్నారు. ఆధార్‌కార్డులో పేరు మార్పులు, అడ్రసులు మార్పు తదితర సేవలను ఈ క్యాంపుల ద్వారా పొందవచ్చన్నారు. పుట్టిన తేదీ మార్పు చేయాలంటే ఖచ్చితంగా సంబంధిత సర్టిఫికెట్లను జతచేయాల్సి ఉంటుందన్నారు. ఈ ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

కంచికచర్ల మండలంలో...

కంచికచర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం నుంచి నాలుగురోజులపాటు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి తెలిపారు. కంచికచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీఅక్షర పబ్లిక్ స్కూల్, గనిఆత్కూరు, పరిటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, చెవిటికల్లు ఎంపీయూపీ స్కూల్‌లో ఈ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. నూతన ఆధార్ కార్డు నమోదు, ఐదేళ్లు నిండిన చిన్నారులకు ఆధార్ అప్‌డేట్, అడ్రస్‌లో మార్పులు తదితర సేవల కోసం ప్రజలు ఈ క్యాంపులను సంప్రదించాలని సూచించారు. ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆలయానికి విరాళాలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సోమవారం గుంటూరుకు చెందిన షేక్ కరీముల్లా రూ.10వేలు విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. గోశాలలోని గోవుల సంరక్షణకు గుంటూరుకు చెందిన ముళ్లపూడి వీఎస్ అమర్‌నాథ్ రూ.10వేలు, పోరంకికి చెందిన దైవాల కోటేశ్వరమ్మ, శైలజ రూ.10,116 అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ


ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న పంటలను పరిశీలిస్తున్న రైతులు

గరికపాడు(జగ్గయ్యపేట): రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంపొందించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సేద్య విభాగం శాస్త్రవేత్త శివప్రసాద్ సూచించారు. స్థానిక కేవీకేలో షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా ఎస్సీ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మూడురోజుల పాటు నిర్వహించనున్న జరిగే శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త శివప్రసాద్ మాట్లాడుతూ వానపాముల ఎరువుల తయారీ, ప్రకృతి వ్యవసాయం చేయడంతో పంటల దిగుబడి వివరాలను రైతులకు వివరించారు. వర్మికంపోస్టు, అజొల్లా ఉత్పత్తి సాంకేతికతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన


మున్సిపల్ ఆఫీసులో కమిషనర్‌కు కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య, తదితరులు

నందిగామటౌన్(నందిగామరూరల్): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థిని గెలిపించాలంటూ నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సోమవారం స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా నందిగామ మున్సిపల్ ఆఫీసు, మండలపరిషత్, రవాణా, విద్యాశాఖ, రెవెన్యూ కార్యాలయాలతో పాటు ప్రభుత్వాస్పత్రిలోనూ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, సిబ్బందికి కరపత్రాలను పంపిణీ చేసి ఆలపాటిని గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల ప్రచారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రదర్శనగా నిశ్శబ్దమా నీ ఖరీదెంత?


నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక రచయిత పీటీ మాధవ్‌కు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు



ఉత్తమనటి పురస్కారం స్వీకరిస్తున్న అమృతవర్షిణి

విజయవాడ కల్చరల్: యూత్ స్పోర్ట్స్ కల్చరల్ ఫోరం, కళావిపంచి, శ్రీ కృష్ణా తెలుగు థియేటర్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఆహ్వాన నాటికల పోటీ ఫలితాలను ప్రధాన కార్యదర్శి నిట్టల శ్యాంప్రసాద్, కోశాధికారి చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ప్రదర్శనగా నిశ్శబ్దమా నీ ఖరీదెంత?, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా జనరల్ బోగీలు, ఉత్తమ దర్శకత్వం చలసాని కృష్ణ ప్రసాద్, ఉత్తమ రచన పీటీ మాధవ్, ఉత్తమ సంగీత దర్శకుడు సాయి గణేశాచారి, ఉత్తమ నటుడు పీపీ వరప్రసాద్, ఉత్తమనటి ఎస్.అమృతవర్షిణి, ఉత్తమ సహాయనటుడు కె.నాగేశ్వరరావు, ఉత్తమ సహాయనటి జాహ్నవి, ఉత్తమ సహాయనటుడు ఇ.పవన్‌కుమార్, ఉత్తమ సహాయనటి సురభి ప్రభావతి, ఉత్తమ హాస్యనటుడు నిట్టల శ్రీరామమూర్తి, ఉత్తమ విలన్ నడిపిల్లి వెంకటేశ్వర్లు, ఉత్తమ మేకప్ థామస్, ఉత్తమ రంగాలంకరణ గిరి ని న్యాయ నిర్ణేతలు బొర్రా నరసయ్య, అమరేంద్ర బొల్లంపల్లి, పెద్ది నరసింహారావు ఎంపిక చేసినట్టు తెలిపారు.

రోడ్డెక్కిన సంచార పశు వైద్య సిబ్బంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): అకస్మాత్తుగా తమను ఉద్యోగంలో నుంచి తొలగించటం అన్యాయమని సంచార పశు వైద్య సిబ్బంది ఆందోళన బాట పట్టారు. ఉద్యోగం నుంచి తొలగించే ముందు కనీసం ఒక నెల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉండగా కేవలం ఒక రోజు ముందు మాత్రమే ఇకపై మీకు సంస్థకు సంబంధం లేదని, సంచార వాహనాలు అప్పగించాలని వాట్సప్ ద్వారా మెసేజ్ పంపటం ఎంతవరకు న్యాయమని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. తమను విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గొల్లపూడి ఇఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఆఫీస్ ముందు ధర్నా చేశారు. మాజీ సీఎం జగన్ హయాంలో తమను విధుల్లోకి తీసుకున్నందుకే కూటమి ప్రభుత్వం తమపై కక్ష కట్టిందని వాపోతున్నారు.

ఏం జరుగుతుందో అర్థం కావటం లేదు



ఇఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్‌లో గత మూడేళ్ల నుంచి వెటర్నరీ వైద్యుడిగా పని చేస్తున్నాను. లేబర్ యాక్ట్ ప్రకారం కనీసం నెల రోజుల ముందు నోటీస్ ఇవ్వాల్సి ఉండగా ఒక రోజు ముందు ఉద్యోగంలో నుంచి తొలగిస్తున్నట్లు అకస్మాత్తుగా మెసేజ్ పంపటం అన్యాయం. సమస్య వచ్చినప్పుడు పరిష్కారం కోసం సీఈఓ, హెచ్ఆర్ వంటి అధికారుల దగ్గరకు వెళ్లి చెప్పుకుందామంటే వారు తరచూ మారుతున్నారు. కొత్తగా వచ్చిన అధికారులకు మళ్లీ మళ్లీ చెప్పుకోవాల్సి వస్తుంది. సంస్థలో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

– డాక్టర్ వీరబాబు, నందిగామ

బెల్లపు ఊట ధ్వంసం

తిరువూరు: ఎక్సైజ్ అధికారులు సోమవారం తిరువూరు సర్కిల్లోని గంపలగూడెం మండలంలో దాడులు నిర్వహించారు. అమ్మిరెడ్డిగూడెంలో సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. తిరువూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జే శ్రీనివాస్, సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు. ఏకొండూరు మండలం గొల్లమందల తండాలో కూడా 150 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామని తెలిపారు. సారా తయారీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శివరాత్రి ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నేడు

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న భవానీ ముక్తేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలపై అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈవో సురేష్‌బాబు సోమవారం తెలిపారు. సాయంత్రం 4గంటలకు ఆలయంలో నందిగామ ఆర్డీఓ బాలకృష్ణ పర్యవేక్షణలో కల్యాణోత్సవాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, అగ్నిమాపక, వైద్యారోగ్య శాఖ, మత్స్య, ఇరిగేషన్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

రిటైర్డు టీచర్‌కు ఎమ్మెల్యే నివాళి

నందిగామరూరల్: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రిటైర్డు టీచర్, అమరావతి పరిరక్షణ జేఏసీ నందిగామ అధ్యక్షుడు నీరుకొండ నరసింహారావు (81) సోమవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నరసింహారావుకు నివాళులర్పించినవారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, నాయకులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల కార్యదర్శుల సంఘం మండల కార్యవర్గ ఎన్నిక మండల విస్తరణాధికారి పద్మావతి పర్యవేక్షణలో సోమవారం జరిగింది. సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాసరెడ్డి (ముక్త్యాల), సాయి సంధ్య (గండ్రాయి), ఉపాధ్యక్షులుగా సంక్రాంత్, లింగయ్య, కోశాధికారిగా సైదానాయక్, సంయుక్త కార్యదర్శులుగా మంగ, రంగారావు, కార్యవర్గ సభ్యులుగా శేఖర్, తిరుపతిరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సంఘం, సభ్యుల అభ్యున్నతికి పనిచేస్తానని తెలిపారు.

కుంభమేళా తీర్థాలతో ప్రత్యేక పూజలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రయాగరాజ్ మహాకుంభమేళా నుంచి తెచ్చిన తీర్థాలతో లెనిన్ సెంటర్ సాయిబాబా మందిరంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి, బాబావారికి, నాగమానసాదేవికి అభిషేకం చేశారు. అనంతరం కాశీలో పూజలు చేసి తీసుకువచ్చిన వస్త్రాలను మహిళా భక్తులకు అందజేశారు. ఆలయ వ్యవస్థాపకుడు సుధాస్వామి మాట్లాడుతూ మహాకుంభమేళాకు ప్రత్యక్షంగా వెళ్లలేని సాయిబాబా భక్తుల కోసం అక్కడ నుంచి తీర్థాలను తీసుకురావడం జరిగిందని తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పుష్పాలంకరణలో రాజరాజేశ్వరీ అమ్మవారు

నందిగామరూరల్: మండలంలోని దాములూరులో వేంచేసియున్న రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వార్షికోత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారిని పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష జలు చేశారు. అమ్మవారికి సుగంధ ద్రవ్యాలు, పంచామృతాభిషేకాలు, త్రిశూల పూజలు చేశారు. అష్టోత్తర సహస్రనామ పూజలు, మూలమంత్ర హోమాది క్రతువులు, పూర్ణాహుతి పూజా క్రతువులను అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ రాజరాజేశ్వరీ సహిత శివకళ్యాణాన్ని వేదోక్తంగా జరిపించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గాదెల వెంకటరామారావు, గాదెల వెంకటేశ్వరరావు, సిద్దు వీరబాబు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు : సీఐ


మాట్లాడుతున్న సీఐ చవాన్

కంచికచర్ల: ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని నందిగామ రూరల్ సర్కిల్ సీఐ డీ చవాన్ హెచ్చరించారు. మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల ఉమెన్స్ హాస్టల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడుతూ విద్యార్థినులు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడి వారి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వ్యక్తిగతంగా ఏవైనా సమస్యలు ఉంటే వార్డెన్‌కు లేదా పోలీసులకు తెలియజేయాలన్నారు. విద్యార్థినులు ఒంటరిగా బయటకు వెళ్లరాదని, ఆకతాయిల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సోషల్ మీడియా విషయంలో జాగ్రత్తలు పాటించాలని, లేనిపక్షంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇంజనీరింగ్ విద్య ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు తోడ్పడుతుందన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజు, హాస్టల్ వార్డెన్, విద్యార్థినులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులు



జగ్గయ్యపేటఅర్బన్: ఇటీవల తెలంగాణాలోని నారాయణపేటలో జరిగిన 24 వ జాతీయ కరాటే పోటీల్లో జగ్గయ్యపేటకు చెందిన వారియర్ మార్షల్స్ అకాడమీకి చెందిన ముగ్గురు విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచారు. కుమితే, కటా విభాగాల్లో దైనిక గోల్డ్‌మెడల్ సాధించగా, ప్రేమ్ కుమార్ బ్రాంజ్ మెడల్, జితేంద్ర గోల్డ్‌మెడల్ సాధించినట్లు కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జాయింట్ సెక్రటరీ ఇ.పూజ సోమవారం తెలిపారు. విజేతలను అకాడమీ సభ్యులు, స్థానికులు అభినందించారు.

బోనాల మహోత్సవం



కంచికచర్ల: స్థానిక మహాలక్ష్మి అమ్మవారు సోమవారం ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ అర్చకులు కాకాని హనుమంత్ సుమన్‌శర్మ అమ్మవారికి నీరాజన మంత్రపుష్పములు, అష్టోత్తర పూజలు, మహన్యాసపూర్వక అభిషేకాలు చేశారు. పెద్దసంఖ్యలో మహిళాభక్తులు పాల్గొని అమ్మవారికి కుంకుమపూజలు చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

నందిగామరూరల్: నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని ఆయా గ్రామాలలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ స్టాలిన్‌కుమార్ సోమవారం తెలిపారు. మండలంలోని చందాపురంలోని 132/33కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు.

రేపు శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



జగ్గయ్యపేట అర్బన్: హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో తొర్రగుంటపాలెం కూడలి వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటు కోసం ఈనెల 19వతేదీన భూమిపూజ చేయనున్నట్లు కోర్‌కమిటీ సభ్యులు తెలిపారు. ధరణికోట విశ్రాంత ఉద్యోగుల భవనంలో విగ్రహం ఏర్పాటు కోర్‌కమిటీ ప్రతినిధులు పబ్బతి నరేంద్ర, సంకా భాస్కర్, నోముల రఘు, తూములూరి అశోక్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ 19వతేదీన ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈసందర్భంగా మహిళా భక్తుల కోలాట ప్రదర్శన, బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేదపండితులు, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, ఆధ్యాత్మిక వేత్తలు, శివాజీ మహరాజ్ యువసేన సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొననున్నట్లు వివరించారు. అందరూ హాజరుకావాలని కోరారు.